# మేడ్చల్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా
# జె.కె శేఖర్ యాదవ్ నియామకం

- 248 వెంకటేశ్వర నగర్ డివిజన్ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఘన సన్మానం
- పార్టీని బలోపేతం చేసి బీసీల గళంగా పనిచేస్తానన్న నూతన అధ్యక్షుడు



**కుత్బుల్లాపూర్, రాజముద్ర న్యూస్ :** బీజేపీ పార్టీని మేడ్చల్ జిల్లాలో మరింత బలోపేతం చేయడంలో భాగంగా, మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా జె.కె శేఖర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను 248 వెంకటేశ్వర నగర్ డివిజన్ బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. 248 వెంకటేశ్వర నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బాలు యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సన్మాన కార్యక్రమం అత్యంత వర్ణంగా జరిగింది. నూతనంగా నియమితులైన శేఖర్ యాదవ్ కు శాలువా కప్పి, పూలమాలలు వేసి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జె.కె శేఖర్ యాదవ్ మాట్లాడుతూ... తనపై పార్టీ అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఓబీసీ మోర్చాను బలోపేతం చేసి బీసీల సంక్షేమానికి, హక్కుల సాధనకు అవిశ్రాంతంగా కృషి చేస్తానని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో బీజేపీ బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రతి ఇంటికీ తీసుకెళ్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ, శేఖర్ యాదవ్ సామాజిక సేవా దృక్పథం కలిగిన నాయకుడని, ఆయన నాయకత్వంలో జిల్లా ఓబీసీ మోర్చా కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతుందని ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలందరూ ఐక్యంగా కృషి చేసి రాబోయే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. ఈ సన్మాన కార్యక్రమంలో భూపాల్ రెడ్డి, మురళీకృష్ణ, శ్రీకాంత్ యాదవ్, రవికుమార్, ప్రశాంత్, శివకుమార్, వినీత్, ప్రతాప్ రెడ్డి, శ్యామ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.


## నేలకొండపల్లి మండలంలో 32 గ్రామ పంచాయతీ ఉపాధి హామీ రికార్డుల పరిశీలన

**సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు..**
**జూన్ 29న రికార్డుల పరిశీలనకు అధికారుల ఆదేశం**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, నేలకొండపల్లి మండల పరిధిలోని 32 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం రికార్డులను పరిశీలించేందుకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం అనుమతి ఇచ్చింది. సమాచార హక్కు చట్టం 2005 కింద దాఖలైన దరఖాస్తు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు★ మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన ఎల్లుట్ల సైదులు ఉపాధి హామీ ద్వారా జరిగిన పనులకు సంబంధించిన సమాచారం కోరుతూ ఆర్.సి.నెం. ఈజీఎస్/307 స.హా.చట్టం 2005 కింద దరఖాస్తు చేశారు. దీనిపై స్పందించిన మండల ప్రజా పరిషత్ కార్యాలయం, దరఖాస్తుదారునికి 29.06.2026 తేదీన రికార్డులు పరిశీలించే అవకాశం కల్పించింది.

**స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషన్ ఆదేశం**

అంతకుముందు స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ హైదరాబాద్ వారు అప్పీల్ నెంబర్ 16454/ఎస్ ఐసి–పి వి ఎస్ ఆర్/2025 డిటి: 4.06.2026 ద్వారా మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం రికార్డులను పరిశీలనకు అందుబాటులో



TELANGANA INFORMATION COMMISSION

ORDER

ఉంచాలని ఉత్తర్వులు జారీ చేశారు.

**రికార్డుల పరిశీలన ఎప్పుడు?**

ఈ ఉత్తర్వుల మేరకు మండల సమాచార అధికారి ఎల్లుట్ల సైదులు ని 29.06.2026న ఉదయం 10:00 గంటలకు నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయానికి హాజరై 32 గ్రామ పంచాయతీల ఉపాధి హామీ రికార్డులను పరిశీలించవచ్చని లేఖ ద్వారా తెలిపారు.

**అధికారులకు ఆదేశాలు**

సంబంధిత 32 గ్రామ పంచాయతీల ఉపాధి హామీ పథకం రికార్డులను గ్రామ పంచాయతీల వారీగా 29.06.2026న ఉదయం 10:00 గంటలకు కార్యాలయంలో సిద్ధంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పరిశీలనకు వచ్చే దరఖాస్తుదారునికి పూర్తి సహకారం అందించాలని సూచించారు.

## కూసుమంచి మండలంలో రూ.16.13 కోట్ల బీటీ రోడ్లు, వంతెనలకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** కూసుమంచి, గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా విస్తృతంగా పర్యటించిన మంత్రి, రూ.16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌లతో కలిసి దుబ్బతండా, లాల్‌సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో మంత్రి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. "వర్షాకాలంలో తండాలు, గ్రామాల ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా




ప్రవహించే వాగుల కారణంగా పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను మంజూరు చేశాం. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారులు, వంతెనలు నిర్మించడం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు అత్యవసర సేవలు, విద్య, వ్యవసాయ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉంటుంది" అని మంత్రి పొంగులేటి తెలిపారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ఆగవని స్పష్టం చేసిన మంత్రి, అధికారులు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. గైగోళ్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ.2.10 కోట్లతో బీటీ రోడ్డు.జెడ్పీ రోడ్డు నుంచి కొత్తూరు–ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ.4.50 కోట్లతో బీటీ రోడ్డు. లాల్‌సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ.2.03 కోట్లతో బీటీ రోడ్డు. జీళ్ళచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్లే ప్రధాన రహదారిపై రూ.7.50 కోట్లతో రెండు వంతెనల నిర్మాణం.మొత్తం అంచనా వ్యయం: రూ.16.13 కోట్లు మంజూరు చేసినారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, పిడి హౌజింగ్ భూక్యా శ్రీనివాస్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటరు 'ఎస్ఐఆర్ ఫామ్' కష్టాలు.. చదువురాని వారికి దిక్కెవరు?

**ఇంటికి ఇచ్చి వెళ్తున్న బీఎల్ఓలు..**
**నింపేదెలాగో తెలియక తికమకపడుతున్న గ్రామీణ ఓటర్లు**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్ ఐ ఆర్) కోసం ఎన్నికల సంఘం ఇంటింటికీ పంపిణీ చేస్తున్న ఫామ్–6, ఫామ్–7, ఫామ్–8లు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. బూత్ లెవెల్ ఆఫీసర్లు (బి ఎల్ ఓ) ఫామ్‌లు ఇంటికి ఇచ్చి "నింపి పెట్టండి" అని వెళ్లిపోవడంతో, చదువురాని వృద్ధులు, నిరక్షరాస్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎన్నికల సంఘం ప్రతి ఎన్నికకు ముందు ఓటరు జాబితాను పకడ్బందీగా సవరించేందుకు (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) నిర్వహిస్తుంది. ఇంటింటి సర్వే ద్వారా కొత్త ఓటర్ల నమోదు, మరణించినవారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, డూప్లికేట్ ఓట్ల గుర్తింపు చేస్తారు. ఇందుకోసం ఫామ్–6 కొత్త ఓటరు నమోదుకు, ఫామ్–7 తొలగింపుకు, ఫామ్–8 వివరాల సవరణకు ఉపయోగిస్తారు."బీఎల్ఓ వచ్చి ఒక కాగితం ఇచ్చి 'మీ పేరు ఉందో లేదో చూసుకోండి, కొత్తవాళ్లు ఉంటే ఫామ్ నింపండి' అని చెప్పి వెళ్లిపోయాడు. మాకు చదువు రాదు. ఇందులో ఇంగ్లీష్‌లో కూడా ఉంది. మా కొడుకు హైదరాబాద్‌లో ఉంటాడు. ఇప్పుడు ఎవరు నింపాలి?" అని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన 68 ఏళ్ల వృద్ధురాలు సుశీల వాపోయింది. ఇలాంటి పరిస్థితి ఒక్క చెన్నారంలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నెలకొంది. ఫామ్‌లో పేరు, తండ్రి/భర్త పేరు, పుట్టిన తేదీ, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, చిరునామా, ఫోటో అతికించడం వంటి 15కు పైగా కాలమ్‌లు ఉన్నాయి. చిన్న తప్పు దొర్లినా దరఖాస్తు తిరస్కరణకు గురవుతుందనే భయంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ అవకాశాన్ని కొందరు దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. "ఫామ్ నింపాలంటే రూ.50 ఇవ్వండి, లేకపోతే మీ ఓటు గల్లంతవుతుంది" అని భయపెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మీసేవ కేంద్రాల్లో కూడా ఒక్కో ఫామ్‌కు రూ.30 నుండి రూ.50 వరకు వసూలు



చేస్తున్నారు.2021 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో అక్షరాస్యత రేటు 66.54%. అంటే దాదాపు 34% మందికి చదువురాదు. వృద్ధులు, మహిళలు, కూలీలు, గిరిజనులు ఎక్కువగా ఈ జాబితాలో ఉన్నారు. వీరంతా ఫామ్ నింపడం కోసం ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. "ఓటు మా హక్కు. ఆ హక్కును వినియోగించుకోవాలంటే మాకు ఇంత కష్టమా?" అని నేలకొండపల్లి మండలానికి చెందిన గిరిజన రైతు ప్రశ్నించాడు. ఈ విషయమై జిల్లా ఎన్నికల అధికారి ఒకరు స్పందిస్తూ, "ఎస్ఐఆర్ ఫామ్‌లు ఇచ్చిన బీఎల్ఓలే ఇంటివద్దనే ప్రజల వివరాలు సేకరించి నింపాలి. చదువురాని వారికి బీఎల్ఓలే సహాయం చేయాలి. ఎవరైనా డబ్బులు అడిగితే 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు" అని తెలిపారు.

**ప్రజల డిమాండ్**

ఇంటివద్దే నింపాలి: బీఎల్ఓలు కేవలం ఫామ్ ఇచ్చి వెళ్లకుండా, ప్రజలను అడిగి అక్కడికక్కడే వివరాలు నింపాలి. గ్రామసభలు: ప్రతి గ్రామంలో ప్రత్యేక క్యాంపులు, గ్రామసభలు పెట్టి సామూహికంగా ఫామ్‌లు నింపించాలి. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. ఆ హక్కును వినియోగించుకునే ప్రక్రియ సామాన్యుడికి భారంగా మారకూడదు. ఎన్నికల సంఘం వెంటనే స్పందించి, చదువురాని వారికి చేయూతనివ్వాలని, బీఎల్ఓలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి. లేదంటే వేలాది మంది పేదలు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది.

## కాంగ్రెస్ యూత్ కమిటీ ఏర్పాటు



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం కన్నాపురం గ్రామంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు రామారెడ్డి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గాండ్ల రంజిత్ అధ్యక్షతన కన్నాపూర్ లో యూత్ కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేశారు, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిన్నంశెట్టి రమేష్, ఉపాధ్యక్షులుగా మంగలి ప్రవీణ్, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామ అధ్యక్షులు, యూత్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు పల్స్ పోలియో టీకా కార్యక్రమం ప్రారంభం

**డా. ఎం. సురేష్**

**రామారెడ్డి రాజా ముద్ర న్యూస్:** రామారెడ్డి మండల పరిధిలోని పీహెచ్‌సీ రామారెడ్డి ఆధ్వర్యంలో పల్స్ పోలియో టీకా కార్యక్రమం ప్రారంభం కానుంది. ప్రమాదకరమైన పోలియో వ్యాధి నుండి పిల్లలను జీవితాంతం రక్షించేది కేవలం రెండు చుక్కల పోలియో మందే. అందువల్ల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డా. ఎం. సురేష్ తెలిపారు. ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా ప్రతి గ్రామం, ప్రతి కుటుంబంలో ఉన్న అర్హులైన పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని సూచించారు ,మొదటి రోజు అన్ని పోలియో బూత్‌లలో టీకా కార్యక్రమం నిర్వహించబడుతుంది. రెండవ, మూడవ రోజుల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి మొదటి రోజు మిస్ అయిన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారు. ఒక్క చిన్నారి కూడా మిస్ కాకూడదు – 100% పోలియో టీకా కవరేజ్ సాధిద్దాం" అని ప్రజలకు పిలుపునిచ్చారు. రెండు చుక్కలు. జీవితాంతం రక్షణపోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి తల్లిదండ్రి భాగస్వామి కావాలి. అని తెలిపారు.

## రాంగ్ రూట్ డ్రైవర్లకు షాక్..!

**బాలానగర్‌లో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్**



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగారు. నిబంధనలు ఉల్లంఘించి రాంగ్ రూట్‌లో ప్రయాణించే వాహనదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం బాలానగర్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. బాలానగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు రాంగ్ రూట్ డ్రైవింగ్‌పై (Wrong-side driving) స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎదురుగా వస్తూ ప్రాణాల మీదకు తెస్తున్న వాహనదారులను అక్కడికక్కడే పట్టుకున్నారు. ప్రమాదకరంగా వాహనాలు నడిపిన వారికి గట్టిగా కౌన్సిలింగ్ ఇవ్వడమే కాకుండా, భారీగా చలాన్లు విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి బాధ్యతారాహిత్యమైన డ్రైవింగ్ వల్లే రోడ్డు ప్రమాదాలు పెరిగి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి సహకరించాలని... ఇకపై కూడా ఈ స్పెషల్ డ్రైవ్స్ కొనసాగుతాయి, నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవన్నారు.

## జూలై 5లోగా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద వానాకాలం సీజన్‌కు సంబంధించిన ఆర్థిక సహాయాన్ని జూలై 30న విడుదల చేయనున్న నేపథ్యంలో, అర్హులైన కొత్త పట్టాదారులందరూ జూలై 5వ తేదీలోగా తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా కోరారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2026 జూన్ 15 నాటికి కొత్తగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులు రైతు భరోసా పథకానికి అర్హులని తెలిపారు. అర్హులైన రైతులు తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి, సంబంధిత మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు పాస్‌బుక్, మొబైల్ నంబర్ సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం అందుబాటులో లేని వారు ఆన్‌లైన్ 1–బి ప్రతిని జతచేయవచ్చని అన్నారు. అర్హత కలిగిన ప్రతి కొత్త పట్టాదారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా దరఖాస్తు చేసుకుంటే, వానాకాలం రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.6వేల చొప్పున ఆర్థిక సాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

